# మెఱుపులు : స్మరణకు గరువం

- వేమూరి వేంకట రామనాథం

తానే "తెలుగు జ్యోతి" గా వెలిగివెలిగి కాల పురుషుని కనికట్టులో పరం జ్యోతిగా మారిన రఘునాథ్, స్మరణకు గరువం కలిగించే యోగ్యుడు. గుఱుతుకు అవధిలేని మంచితనం గడ్డకట్టి, చివరకు వానినే గడ్డవేసింది. మంచితనానికి, గడ్డకు, రెంటికి పూజ్య - అభినందనమే యీ వాక్యం.

పత్రికా సంపాదకత్వం రెండుప్రక్కల వాడి గల కత్తిపై నాట్యమాడడం వంటిది - అది మంచి నాట్యమయితే. దానికి ప్రతిభ కలిగించేది, పరిశీలనా స్వాతంత్ర్య సామర్థ్యానికి పదును కలిగించేది. పత్రిక సొగసు ఈ రెంటిపై ఆధారపడి యుంటుంది - ఒక సమితి తరఫున ప్రచురించే వాహికలో ఇది మఱింతగా నిజం. ఈ పరిస్థితిలో అనితరంగా మెప్పుదల గడించిన సంపాదకుడు రఘునాథ్

అతని క్లుప్త సంపాదకీయాలలో మన సంస్కృతికి పట్టంగట్టే ఘణుకులు చాలా ఉండేవి "మీనేస్తం" అని సంతకం చేస్తూ. (ఇచట వెవరింపనవసరం లేని) ఎన్నో మెత్తని పలుకుల గొలుసులు చిలుకుతూ ఉండేవాడు. సద్విమర్శ, సరసమైన వాక్యాలలో వెలువరిస్తే, ఫలితం మంచిది అవుతుందన్న ఊహతో ఈ గొలుసులకు ముత్యాలు, వజ్రాలు తగిలించే వాడు రఘునాథ్

ఈ పత్రిక (తొలుత మఱొక పేరుతో) సుమారు 20 ఏళ్ళు నడిపాడు - తాడిచెట్టులాగా కాదు, నిత్యవసంతకాలపు మామిడి వృక్షంలాగా. ఇంత దీర్ఘకాలం పత్రికను సంపాదించటం ఎంత ఉదాత్తమైన విషయమో, అనుభవంగల వారికి విదితమవుతుంది. నేను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో "అప్లయిడ్ ఇకనామిక్ పేపర్సు" అన్న త్రైమాసిక పత్రికను అయిదేండ్లకు మించి నడపలేక పోయినాను; ధనాభావం వలన కాదు, ప్రచురణ యోగ్యములయిన వ్యాసాల అభావం వల్ల! ఈ సమస్యను ఎదుర్కొన్ గలిగాడు రఘునాథ్

తనకు భుక్తినిచ్చే ఉద్యోగం వేఱు; పైగా తఱుచుగా విదేశయాత్రలు! అయినా "తెలుగుజ్యోతి" కోసం తాను సమర్పించిన కాయకష్టం ఎంత నిశితము, విపులము అయినదో! ఈ పరిచర్యలో తనకు అన్ని విధాల అర్ధాంగి అయిన ప్రభకు ఉంది. (అలాగే భావరాజు మూర్తికి, భారతికి) విసువులేక తన పిల్లపెళ్ళివలె సర్వాంగసుందరంగా "తెలుగుజ్యోతి"ని సంపాదించాడు రఘునాథ్

ఇదంతా పైకి తన పత్రికాసంపాదకత్వసామర్థ్యం తెలియచేసినట్లున్నా, దాని ఆంతర్యం ఏమంటే, ఉన్నత సాంస్కృతికస్థాయి కోసం. అతనికి గల దీక్ష; "విదేశం"లో తెలుగుతనం కోసం ఆరాటం ఇవి మూర్తీభవించినవాడు రఘునాథ్

వానితో నాకు "తెలుగుజ్యోతి" భాంధవ్యం చాల యాదృచ్ఛికంగా మొదలయింది. ఒక నాడు ఏదో సంభాషణ క్రమంలో "ఏమండీ! మీరు ప్రతినల తెలుగుజ్యోతిలో ఏదైన వ్రాయరాదా" అని ప్రశ్నార్థకంగా అర్థన బిగించాడు. నేను "సరే అన్నాను. దాని ఫలితమే మార్చి 1994 నుండి ఈ పత్రికలో వస్తున్న "మెఱుపులు". వీటికి మొలక ఇతరులెఱుగని మెఱుపు రఘునాథ్ నాతో వానికి ప్రత్యేకత పారస్పర్యం, నేనతని నిక్కడ చూడకమొందే, నాటుకున్నది. నా రిసెర్చి విద్యార్థులలో ఒక ఉత్తముడు (కె.టి. రామాచారి) ఇతనికి మేనమామ, తఱచు నన్ను గుఱించి ప్రశంసాస్ఫోరకంగా తనతో చెపుతూ ఉండేవాడట. నన్ను "తెలుగుజ్యోతి"కి తప్పనిసరి రచయితగా ఆహ్వానించటంలో తానేమీ పొరపాటు చేయటంలేదని ఊహింపగలవాడు రఘునాథ్

ఇక సాంస్కృతికేతర రంగాల పరంగా రెండు మాటలు. "మనవారి"కి సాయంచేయటంలో ఇక్కడి పెద్దలు కొద్దిమందిలో తానొక ఉత్తముడు. ప్రభ కూడ ఉత్తమ సహధర్మచారిణిగా "దేశం కాని దేశంలో" ఉన్న "మన వారి"కి అవసరం ఆదేశించిన సందర్భంలో, తోడు కలిగించగల యువతి. ఎంత దాచిపెట్టుకోదలచినా, పైకి ఉబుకుతున్నది, మూడు నెలల క్రింద నా కుమారుడు కృష్ణ స్వర్గస్థుడయిన సందర్భంలో మాకుటుంబానికి - నాకు ముఖ్యంగా - ఎంత సాంత్వనం చేకూర్చాడో రఘునాథ్

తనకు గల ఆర్థిక సౌభాగ్య. వలన కాదు ఇది ఎందఱికి లేదు? తెలుగు నేల నుండి వచ్చిన యాత్రికులకు ప్రసిద్ధులకుతల్లి తోడుగా ప్రభ; లౌకిక సహాయదాతగా ఎన్నో అజ్ఞాతంగా ఖ్యాతి గన్న వాడు రఘునాథ్

ఇలా వివిధ ప్రజ్ఞలతోను, గుణసంపదతో విలసిల్లిన వానికి మా వేమూరి చంద్రావతిరామనాథం ఛారిటబుల్ ట్రస్టు తరపున ప్రశంసాపత్రం, శాలువా బహుకరించాము కొద్ది సంవత్సరాల వెనుక. వాటికి నిస్సందేహంగా అర్హుడీ రఘునాథ్

మఱొక ఉత్తమత్వ సంకేతం పేర్కొంటాను. అనేక సందర్భాలలో - ఉ తెలుగు సారస్వతసమూకము - "మీరు ఇది చేయాలి, చేస్తారా" అని అడగ బడినప్పుడు "సరే" అని అంటే, ఆమాట గడువులో నిలబెట్టు కొనగల్గిన సత్పురుషుడు రఘునాథ్

ఇది సంక్షిప్తంగా, రఘునాథ్ మీద నాకు తోచిన విషయాల సమర్పణ . ఇన్ని మంచిగుణాలున్నా, అప్పుడే ఎందుకు పైకి పోయినాడో! వాత్సల్యానికి వార్ధి యైన నా కుమారుడు కృష్ణను గుఱించి కూడ నాకిదే ప్రశ్న పొడముతూ ఉంటుంది. సమాధానం : పై వేల్పులకు కూడ వారిని దగ్గఱ చేర్చుకోవాలన్న తహతహ యేమో! (బ్రహ్మ అది ముందే యెఱుగును.) అలాంటి వాడు రఘునాథ్

వ్యక్తిగా శ్లాఘనీయు డవటమే కాక, వ్యక్తిని మించిన సంస్థయే రఘునాథ్ సామర్థ్యం, సరసత్వం,సహాయత్వం,సమయస్ఫూర్తి ,సామాజిక దృష్టి, సరి మిశ్రంగా శరీరం దాల్చిన అసాధారణుడు రఘునాథ్ అలాంటి శరీరం ఇచటనే యితరులకు పాఠంగా వదలి, శాశ్వతత్వం గడించావా, అప్పుడే రఘునాథ్.